@netifocusnews @focustv
http://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || మంగళవారం 30, జూలై 2024 || పేజీలు: 04

## సోమేశ్ కల్వకుంట్ల నమ్మిన బంటు

- జివిఎస్టీ స్కామ్‌పై.. కాంగ్రెస్ సెటైరికల్ ట్వీట్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 29:

ఆయన సివిస్ కాదు.. కల్వకుంట్ల ఫ్యామిలీకి నమ్మిన బంటు అని తెలంగాణ మాజీ సివిస్ సోమేశ్ కుమార్‌పై తెలంగాణ కాంగ్రెస్ సెటైర్ వేసింది. జీఎస్టీ కుంభకోణంలో సోమేశ్‌కుమార్‌పై కేసు, వాణిజ్య పన్నుల శాఖ ఫిర్యాదుతో సిసిఎస్‌లో కేసు నమోదు కావడంతో పాటు, ఎఫ్‌ఐఆర్‌లో ఐదో నిందితుడిగా పేరు అంటూ వార్త పత్రికల్లో వచ్చిన కథనాన్ని ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తూ మిగతా 2లో..



# జీఎస్టీ కుంభకోణం కేసు.. సీఐడీ చేతికి

## సోమేష్ కుమార్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు..

- సీసీఎస్ నుంచి బదలాయించిన ప్రభుత్వం
- మరింత లోతుగా దర్యాప్తునకు ఆదేశం..
- రూ.వేల కోట్లలో స్కామ్ జరిగిందని నిర్ధారణ
- ఇప్పటికి తేలింది రూ.1,400 కోట్లు..

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 29:

రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలోని వస్తు సేవల పన్ను(జీఎస్టీ) కుంభకోణం కేసును ప్రభుత్వం సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస) నుంచి నేర పరిశోధన విభాగం(సీఐడీ)కు బదలాయించింది. ఈ స్కామ్‌లో మరింత లోతుగా దర్యాప్తు చేయాలని ఆదేశించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని సంస్థల భాగస్వామ్యం ఉండడం, ఏకంగా రూ.1400 కోట్ల కుంభకోణం కావడంతో.. సీఐడీకి అప్పగించింది. ప్రాథమిక విచారణ మేరకు ఈ కేసులో మాజీ ప్రధాన కార్యదర్శి(సీఎస్) పాత్ర ఉన్నట్లు తేలడంతో.. సీఐడీ దర్యాప్తు పూర్తయితే.. ఆయన చుట్టూ ఉచ్చు బిగుసుకోవడం ఖాయమని తెలుస్తోంది. కుంభకోణం మొత్తం సోమేశ్‌కుమార్ కనుసన్నల్లోనే నడిచినట్లు ప్రభుత్వం భావిస్తోంది. ఆడిట్‌లోనే తేలిన స్కామ్ వస్తువులను భౌతికంగా సరఫరా చేయకపోయినా.. బోగస్ ఇన్వాయిసలను సృష్టించి, పెద్ద ఎత్తున ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ)ను క్లెయిమ్ చేసినట్లు వాణిజ్య పన్నుల శాఖ గత ఏడాది చివర్లో నిర్వహించిన ఆడిట్‌లో గుర్తించింది.

ఆ తర్వాత అంతర్గత విచారణ జరిపి, స్కామ్ నిజమేనని నిర్ధారించుకున్నాక.. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ రవి కానూరి సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిగతా 2లో..






## చట్టం ప్రకారమే ఎలివేటెడ్ కారిడార్‌కు భూసేకరణ

- సికింద్రాబాద్ క్లబ్‌కు ముందస్తు నోటీసు ఇవ్వండి
- హెచ్‌ఎండీఏకు హైకోర్టు ఆదేశాలు

2






## తెరుచుకున్న శ్రీశైలం మూడు గేట్లు

### దిగువకు 1.62 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

- ఆల్మట్టి నుంచి శ్రీశైలం వరకు జలకళ
- సాగర్‌లో విద్యుదుత్పత్తి ప్రారంభం..

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 29:

కృష్ణమ్మ శ్రీశైలాన్నీ దాటేసి నాగార్జున సాగర్ దిశగా పరుగులు పెడుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చిచేరుతుండటంతో మూడు గేట్లు ఎత్తి, దిగువకు నీటిని వదిలిపెట్టారు. సాగర్‌లోకి 1.62లక్షల క్యూసెక్కుల నీరు వెళుతోంది. ఆల్మట్టి నుంచి శ్రీశైలం దాకా కృష్ణా బేసిన్‌లో జలాశయాలన్నీ నిండుగా ఉన్నాయి. శ్రీశైలం నుంచి ఎగువన కృష్ణా బేసిన్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ నిండినట్లే. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు భారీగా వరద వచ్చిచేరుతుండటంతో తెలంగాణ జెన్‌కోకు చెందిన 234 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్రియదర్శిని జూరాల, 240 మెగావాట్ల సామర్థ్యం కలిగిన లోయర్ జూరాల జలవిద్యుత్తు మిగతా 2లో..



## నేడు రెండో విడత రుణమాఫీ

### లక్షన్నర మధ్య రుణాలన్నీ మాఫీ..

### 7లక్షల మంది రైతులకు ప్రయోజనం..

### మొత్తం రూ.6,500 కోట్ల నగదు బదిలీ

### రైతువేదికల్లో ప్రత్యక్ష ప్రసారం: మంత్రి తుమ్మల

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 29:

రెండో విడత రుణమాఫీకి ముహూర్తం ఖరారైంది. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు రెండో విడత రుణమాఫీ నగదు బదిలీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారు. అసెంబ్లీ ఆవరణలోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అదే సమయంలో వివిధ జిల్లా కలెక్టరేట్లలో ఆ జిల్లా కలెక్టర్లు రైతులకు చెక్కులు పంపిణీ చేస్తారు. లక్షన్నర లోపు బకాయిలు ఉన్న సుమారు 7 లక్షల మంది రైతులకు మంగళవారం రూ.6,500 కోట్లు విడుదల చేయనున్నారు. లక్ష రూపాయల వరకు ఈ నెల 18 న రుణమాఫీ చేసిన ప్రభుత్వం... లక్షన్నర కేటగిరీలో ఉన్న రైతులకు ఈ నెలాఖరు లోపు రుణమాఫీ చేస్తామని అప్పుడే ప్రకటించింది. ఇందుకు అవసరమైన నిధుల సమీకరణ చేపట్టింది. ఈ నెల 15న జీవో నెంబరు- 567 జారీచేసే నాటికే రూ.10 వేల కోట్లు సర్దుబాటు చేసింది. తొలి విడతలో 11.50 లక్షల మంది రైతులకు రూ.6,099 కోట్లు విడుదల చేసింది. మిగిలిన నిధులకు తోడుగా ఈనెల 23 న రూ.3 వేల కోట్లు రిజర్వు బ్యాంకు నుంచి అప్పు తీసుకుంది. దీంతో ఖజానాలో రూ.7 వేల కోట్ల వరకు పోగయ్యాయి. రెండో విడతకు ఈ నిధులు సరిపోతాయనే ఉద్దేశంతో మంగళవారం పంపిణీకి శ్రీకారం చుడుతున్నారు. మిగతా 2లో..



### విద్యుత్ కొనుగోళ్లు, ప్లాంట్ల ఏర్పాట్లలో అవినీతి

- విద్యుత్ విచారణ కమిషన్ ఏర్పాటుతో ముచ్చెమటలు
- కమిషన్ రద్దు చేయాలని కెసిఆర్ ఎందుకు కోర్టుకు వెళ్లారు
- విద్యుత్ సివిల్ పనులన్నీ అనుయాయులకు కేటాయింపు
- అసెంబ్లీలో గత ప్రభుత్వ విధానాలపై రేవంత్ విమర్శలు

02లో..

## తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్‌లో భారీ కుంభకోణం

- జివిఎస్టీ చెల్లింపుల్లో అక్రమాల గుర్తింపు
- మాజీ సివిస్ సోమేశ్ కుమార్‌పై కేసు నమోదు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 29:

తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్‌లో భారీ కుంభకోణం జరిగిందని గుర్తించిన అధికారులు కేసు నమోదు చేసారు. కమర్షియల్ ట్యాక్స్ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ చెల్లింపులో అక్రమాలు జరిగాయని గుర్తించిన అధికారులు కేసు నమోదుచేశారు. ఈ కుంభకోణంలో మాజీ సీఎస్ సోమేష్‌కుమార్‌తో పాటు పలువురు కీలక పాత్ర పోషించారని కేసులు నమోదు చేశారు. ఈ కుంభకోణంలో వందకోట్ల వరకు అక్రమాలు జరిగినట్టు భావిస్తున్నారు. దాదాపు 75 కంపెనీలు ఇందులో భాగమై ఉన్నట్టు తేల్చారు. సాఫ్ట్‌వేర్ లో మార్పులు చేసి కుంభకోణానికి పాల్పడినట్టు ఫోరెన్సిక్ ఆడిట్‌లో తేలింది. మిగతా 2లో..

నేటి ఫోకస్ న్యూస్

మంగళవారం 30, జూలై 2024

# జీఎస్టీ కుంభకోణం.. సీఐడీ చేతికి..

(మొదటి పేజీ తరువాయి..)

ఆ మేరకు సోమేశ్‌కుమార్‌తో సహా వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ ఎస్వీ కాశీవిశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ శివరామ్ ప్రసాద్, ఐఐటీ–హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు, ప్లియాంటో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌పై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ(ఐజీఎస్టీ)కి సంబంధించి రూ.1400 కోట్ల మేర ఐటీసీని క్లెయిమ్ చేసినట్లు, దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లినట్లు సీసీఎస్ పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. అయితే.. ఇది వందల కోట్ల వ్యవహారం కాదని, మొత్తం స్కామ్ రూ.వేల కోట్లలో ఉంటుందని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. అందుకే సమగ్ర దర్యాప్తు కోసం సీఐడీకి అప్పగించింది.

# సోమేశ్ కల్వకుంట్ల నమ్మిన బంటు

(మొదటి పేజీ తరువాయి..)

గత బిఆర్ఎస్ ప్రభుత్వంపై పలు విమర్శలు చేసింది. అలాగే ప్రజా ధనానికి కస్టోడియన్ గా ఉండాల్సిన మాజీ సిఎస్ ప్రజాధనం దోపిడీకి మార్గదర్శిగా మారారని కాంగ్రెస్ ÷ర్ అయ్యింది. జీఎస్టీ వసూళ్లలో ఏకంగా రూ.1000 కోట్ల గోల్ మాల్ స్కాం తాజాగా బట్టబయలయ్యిందని చెబుతూ తెలంగాణలో గడచిన పదేళ్లూ స్కామ్‌ల పాలన జరిగిందనడానికి ఇది మరో నిదర్శనమని టి కాంగ్రెస్ ఎక్స్ ద్వారా ఈ ఆరోపణలు చేసింది. తెలంగాణలో గడచిన పదేళ్లూ 'స్కామిలీ' పాలన జరిగిందనడానికి ఇది మరో నిదర్శనం' అని ఆరోపించింది.

# చట్టం ప్రకారమే ఎలివేటెడ్ కారిడార్‌కు భూసేకరణ

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–జూలై 29:

రాజీవ్‌రహదారి ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణ విషయంలో చట్టప్రకారం వ్యవహరించాలని హెచ్‌ఎండీఏకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఓఆర్‌ఆర్ జంక్షన్ వరకు నిర్మించతలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ విషయంలో తమకు నోటీసు, సమాచారం ఇవ్వకుండా పనులు చేపట్టేందుకు హెచ్‌ఎండీఏకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని పేర్కొంటూ సికింద్రాబాద్ క్లబ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది సునీల్ బీ గాను వాదనలు వినిపిస్తూ.. కంటోన్మెంట్ పికెట్ వద్ద తోకట్ట గ్రామపరిధిలోని 22 ఎకరాల్లో ఉన్న సికింద్రాబాద్ క్లబ్‌కు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా టన్నెల్స్, నిర్మాణాల పనులు చేపట్టడం చెల్లదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. కారిడార్ కారణంగా సికింద్రాబాద్ క్లబ్‌కు చెందిన బంగ్లాలు, ఆస్తులకు నష్టం కలిగించే పక్షంలో పిటిషనర్‌కు ముందస్తు నోటీసులు ఇవ్వాలని పేర్కొంది.

# తెరుచుకున్న శ్రీశైలం మూడు గేట్లు

(మొదటి పేజీ తరువాయి..)

కేంద్రంతో పాటు 900 మెగావాట్లు కలిగిన శ్రీశైలం భూగర్భ జలవిద్యుదుత్పాదన పరుగులు పెడుతోంది. సాగర్‌లో సోమవారం రాత్రి 9గంటలకు ఎనిమిది టర్బైన్ల ద్వారా విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. గోదావరి బేసిన్‌లోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 16081 క్యూసెక్కుల వరద వస్తుండగా... ఈ ప్రాజెక్టు నుంచి 16 వేల క్యూసెక్కులను పంపింగ్ చేసి, మిడ్‌మానేరుకు తరలిస్తున్నారు. ఎల్లంపల్లి జలాశయం నుంచి రెండు టన్నెల్‌ల ద్వారా నందిమేడారంలోని పంప్‌హౌస్ సర్జ్‌పూల్‌కు నీటిని తరలించి, ఆ నీటిని నంది రిజర్వాయర్‌లో వేసి, అక్కడి నుంచి రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ పంప్‌హౌస్ నుంచి పంపింగ్ చేసి, మిడ్‌మానేరులో వేస్తున్నారు. తొలుత మిడ్‌మానేరు, ఆ తర్వాత లోయర్ మానేరుకు నీటిని తరలించి, శ్రీరాంసాగర్ ఆయకట్టుకు నీటిని అందించనున్నారు. ఆ తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టులోని ఆన్‌లైన్ రిజర్వాయర్లు అయిన అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లను నీటితో నింపనున్నారు. గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకు కాస్తా వరద తగ్గుముఖం పట్టింది. మంజీరా నదిపై ఉన్న సింగూరు ప్రాజెక్టుకు 1779 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా... నిజాంసాగర్ ప్రాజెక్టుకు 460 క్యూసెక్కులు, శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టుకు 17310 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టుకు 4860 క్యూసెక్కులు, ప్రాణహితపై ఉన్న మేడిగడ్డ బ్యారేజీకి 5.79 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ప్రాణహిత–ఇంద్రావతిపై సమ్మక్క సాగర్ బ్యారేజీకి 8.56 లక్షల క్యూసెక్కులు, సీతమ్మసాగర్(దుమ్ముగూడెం)కు 9.32 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రికార్డయింది. దాంతో ఈ బ్యారేజీలకు వచ్చిన వరదను వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి 43 అడుగుల ఎత్తులో ప్రవహిస్తోంది.

# మాదిగలకు కేటినేట్‌లో చోటు కల్పించండి

## సిఎం రేవంత్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–జూలై 29:

మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాదిగ ఎమ్మెల్యేలు వినతి పత్రం సమర్పించారు. అసెంబ్లీ టీ బ్రేక్ సమయంలో అద్లూరి లక్ష్మణ్, కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామ్యేల్, లక్ష్మీకాంతారావు, వేముల వీరేశం.. సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. తెలంగాణలో అతిపెద్ద సామాజిక వర్గమైన తమ కమ్యూనిటీకి అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వంలో మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలని ఆ సామాజిక వర్గ నేతలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. జనాభా పరంగా గణనీయ సంఖ్యలో ఉన్న తమకు కేబినెట్‌లో చోటు ఇవ్వాలని కోరుతున్నారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వికారాబాద్–కృష్ణా రైల్వే లైన్ రూట్ మ్యాప్‌ను రైల్వేశాఖ చీఫ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యన్ వివరించారు. వికారాబాద్, పరిగి, కొడంగల్, నారాయణపేట్, మక్తల్ మీదుగా ఈ రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. రూ.3,500 కోట్లతో 145 కి.మీ పొడవుతో ఏర్పాటు చేయనున్న ఈ రైల్వే లైన్ రూట్ మ్యాప్‌పై సీఎం రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, వాకాటి శ్రీహరి, పర్ణిక రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ కొనుగోళ్లు, ప్లాంట్ల ఏర్పాట్లలో

# అవినీతి

- విద్యుత్ విచారణ కమిషన్ ఏర్పాటుతో ముచ్చెమటలు
- కమిషన్ రద్దు చేయాలని కెసిఆర్ ఎందుకు కోర్టుకు వెళ్లారు
- విద్యుత్ సివిల్ పనులన్నీ అనుయాయులకు కేటాయింపు
- అసెంబ్లీలో గత ప్రభుత్వ విధానాలపై రేవంత్ విమర్శలు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–జూలై 29:

విద్యుత్ కొనుగోళ్లు, ప్లాంట్ల ఏర్పాటు తదితర విషయాల్లో అసెంబ్లీలో వాడీవేడి చర్చ జరిగింది. గత ప్రభుత్వ అక్రమాలను వెల్లడిస్తూ సిఎం రేవంత్ ఘాటు విమర్శలు చేశారు. అలాగే విద్యుత్ కమిషన్ విసయంలో ఛైర్మన్‌ను మార్చాలని సుప్రీం సూచించిందే తప్ప.. విచారణను ఆపమనలేదని అన్నారు. విచారణ ఆపాలని కోర్టుకు వెళ్లిన కెసిఆర్..ఎందుకు విచారణను అడ్డుకుంటున్నట్లో

చెప్పాలన్నారు. ప్రశోత్తారాలపై చర్చను సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ రద్దు చేశారు. ఆర్థిక నిర్వహణ , ఆర్థిక ప్రణాళిక, విద్యుత్ డిమాండ్స్‌పై చర్చ చేపసట్టారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ ఒప్పందాల విషయంలో సత్యహరిశ్చంద్రుడి తరువాత కేసీఆరే అన్నట్లు వాళ్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఛత్తీస్ ఘడ్, యాదాద్రి, భద్రాద్రి ఒప్పందాలపై వారే విచారణకు అడిగారని, వాళ్ల కోరిక మేరకే విచారణకు కమిషన్ నియమించామన్నారు.. కమిషన్ వద్దకు వచ్చి వివరాలు ఇవ్వాలని కోరితే కమిషన్‌పైనే ఆరోపణలు చేశారని విమర్శించారు. విచారణ కమిషన్ ముందు వాదన వినిపించకుండా కమిషన్ రద్దుచేయాలని కోర్టుకు వెళ్లారని, విచారణ కొనసాగించాల్సిందేనని సుప్రీంకోర్టు చెప్పిందని, అయితే కొత్త కమిషన్ చైర్మన్‌ను నియమించాలని న్యాయస్థానం చెప్పిందని సీఎంరేవంత్ రెడ్డి తెలిపారు. విచారణ కమిషన్‌కు కొత్త చైర్మన్‌ను సోమవారం సాయంత్రంలోగా నియమిస్తామన్నారు. తెలంగాణకు వాళ్లే ఏదో కొత్త వెలుగులు తెచ్చినట్లు మాట్లాడుతున్నారని.. వైఎస్ హయాంలో తీసుకున్న నిర్ణయాలతోనే హైదరాబాద్ నగరానికి నిరంతర విద్యుత్ సరఫరా జరిగిందని, ఏ ప్రాంతంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తే ఆ ఆస్తులు సంబంధిత ఆస్తులు ఆ రాష్ట్రానికే చెందుతాయని చట్టం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. కానీ ఉత్పత్తి ప్రాతిపదికన కాకుండా, వినియోగ ప్రాతిపదికన విభజన జరగాలని ఆనాడు జైపాల్ రెడ్డి కేంద్రాన్ని ఒప్పించారన్నారు. రాజ్యాంగంలో లేని ప్రత్యేక మినహాయింపు తెలంగాణకు ఇప్పించారని, 53.46 శాతం తెలంగాణకు, 46.54 శాతం ఏపీకి విద్యుత్ పంపిణీ చేసేలా జైపాల్ రెడ్డి తీవ్రంగా కృషి చేశారని, తెలంగాణ రాష్ట్రాన్ని చీకట్లు కమ్మకుండా చేశారని కొనియాడారు. నాడు కేసీఆర్ ఎలా సభను తప్పుదోవ పట్టించారో 2015 రికార్డులు తీయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆనాడు తాను సభలో మాట్లాడితే సభ నుంచి మార్షల్స్‌తో బయటకు పంపించారన్నారు. సోలార్ ప్రాజెక్ట్ గురించి గొప్పగా చెబుతున్నారు... అవి ప్రైవేటు కంపెనీలు ఉత్పత్తి చేస్తున్నాయని, వాళ్ల పాలనలో సోలార్ పవర్ కేవలం ఒక మెగావాట్ మాత్రమేనని అన్నారు. పవర్ ప్లాంట్స్‌కు సంబంధించి ఎలక్ట్రో మెకానికల్ వర్క్, సివిల్ వర్క్ కాంట్రాక్టు విషయంలో వాళ్ల తెలివి ప్రదర్శించారని, గంపగుత్తగా బీహెచ్‌ఈఎల్‌కు కాంట్రాక్టు అప్పగించారన్నారు. బీహెచ్‌ఈఎల్ నుంచి సివిల్ వర్క్స్ మొత్తం వాళ్ల బినామీలు, బంధువులు, అనుయాయులకు ఇచ్చారని ఆరోపించారు. అందులో వేలకోట్ల అవినీతి జరిగిందని సీఎం విమర్శించారు. విచారణలో అంతా బయటపడుతుందనే ప్రజలను తప్పుదారి పట్టించాలని చూస్తున్నారన్నారు.

400 మెగావాట్ల విద్యుత్ ప్లాంటుకు టెండర్ వేస్తే సూపర్ క్రిటికల్ టెండర్ పిలిస్తే కొరియన్, బీహెచ్‌ఈఎల్, మరో కంపెనీ పాల్గొన్నాయని.. అక్కడ 18 శాతం లెస్‌కు బీహెచ్‌ఈఎల్ పనులు దక్కించుకుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇక్కడ కూడా 18 శాతం లెస్‌కు పనులు చేసే అవకాశం ఉన్నా.. ప్రాజెక్టును నామినేషన్‌పై బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించారన్నారు. అందులో దాదాపు రూ. 8 వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టు విషయంలో సబ్ క్రిటికల్ టెక్నాలజీతో గుజరాత్‌లోని ఇండియా బుల్స్ కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చారని, సూపర్ క్రిటికల్ టెక్నాలజీ ఉపయోగించాలని చట్టంలో

ఉన్నా ఉల్లంఘించారని విమర్శించారు. ఇండియా బుల్స్ నుంచి రూ. వెయ్యి కోట్లు మెక్కి కాలం చెల్లిన సబ్ క్రిటికల్ టెక్నాలజీ ఉపయోగించారని, భద్రాద్రి పవర్ ప్రాజెక్ట్ కట్టాల్సిన చోట కట్టలేదని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. వాళ్ల నిర్వాకంతో 16 మంది అధికారులు విచారణ ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రెండేళ్లలో పూర్తి కావాల్సిన పనులు ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న పరిస్థితి నెలకొందని, వారి కోరిక మేరకే విచారణ కమిషన్ ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దొరికిపోయామని అర్థమైంది కాబట్టే కమిషన్‌పై ఆరోపణలు చేశారన్నారు. కావాలన్నది వాళ్లేనని.. సెగ తగలగానే వద్దన్నది వాళ్లేనని పేర్కొన్నారు. తిన్నింటి వాసాలు లెక్కబెట్టే లక్షణాలు తమకు లేవని.. మీ వాదన ఏంటో కమిషన్ ముందు చెప్పాలన్నారు. ఈరోజు సాయంత్రానికల్లా విచారణ కమిషన్‌కు కొత్త చైర్మన్‌ను నియమిస్తామని సీఎం రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. విద్యుత్ అంశంలో న్యాయ విచారణ కోరిందే భారాస సభ్యులు అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'జగదీశ్‌రెడ్డి ఆవేదన చూస్తుంటే చర్లపల్లి జైలులో ఉన్నట్లు మాట్లాడుతున్నారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు, యాదాద్రి పవర్‌ప÷–లాంట్‌పై న్యాయ విచారణ జరుగుతోంది. విచారణ కమిషన్ ముందు వాదనలు వినిపిస్తే భారాస సభ్యుల నిజాయతీ బయటకు వస్తుంది. న్యాయ విచారణ కోరింది వాళ్లే.. వద్దంటున్నది వాళ్లే. విద్యుత్ కమిషన్ ఎదుట కేసీఆర్ ఎందుకు హాజరు కాలేదని అన్నారు.

## తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్‌లో

# భారీ కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి..)

ఇందులో తెలంగాణల బేవరేజెస్ కార్పొరేషన్ కూడా ఉందని సమాచారం. ఇందతా అప్పట్లో సీఎస్‌గా ఉన్న సోమేష్‌కుమార్ సూచనలతోనే ట్యాక్స్ పేమెంట్ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు ఇతర చర్యలు తీసుకున్నారని అధికారులు గుర్తించారు. అందుకే ఈ కేసులో సోమేష్‌కుమార్‌తోపాటు ఐఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు, కమర్షియల్ ట్యాక్స్ అడిషనల్ కమిషనర్ కాశీ విశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ ఎ.శివరామ ప్రసాద్, పిలాంటో టెక్నాలజీస్‌పై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సోమేశ్‌కుమార్‌పై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. పన్ను ఎగవేతదార్లకు వీరు సహకరించడం ద్వారా రూ.వేల కోట్ల అక్రమాలు జరిగినట్లు ఆశాఖ జాయింట్ కమిషనర్ రవి కానూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. ఒక్క తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్ పన్ను ఎగవేత ద్వారానే వాణిజ్యపన్నుల శాఖకు రూ.1,000కోట్లకుపైగా నష్టం వాటిల్లగా.. మరో 11 ప్రైవేటు సంస్థలు సుమారు రూ.400కోట్లు ఎగవేసినట్లు ప్రాథమికంగా వెల్లడైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌లోని వివరాల మేరకు.. మానవ వనరులను సరఫరా చేసే బిగ్‌లీప్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పన్ను చెల్లించకుండానే రూ.25.51కోట్ల ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ తీసుకుని మోసానికి పాల్పడినట్లు తేలిన నేపథ్యంలో వాణిజ్యపన్నుల శాఖ అంతర్గతంగా విచారణ జరిపింది. వాణిజ్యపన్నులశాఖకు సాంకేతికతను అందించే సర్వీస్ ప్రొవైడర్‌గా ఐఐటీ హైదరాబాద్ వ్యవహరించింది. తెలంగాణలో పన్ను చెల్లింపుదారులు నమోదు చేసే ఐటీ రిటర్న్‌ల్లో అక్రమాలను గుర్తించడంతోపాటు డేటాను విశ్లేషించడం సర్వీస్‌ప్రొవైడర్ చేయాల్సిన పని. పన్నుచెల్లింపు దారుల్లో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సర్వీస్ ప్రొవైడర్ రూపొందించిన 'స్క్రూటినీ మాడ్యూల్' గుర్తించాల్సి ఉంటుంది. కానీ బిగ్‌లీప్ టెక్నాలజీస్ అక్రమాలకు పాల్పడినా ఈ మాడ్యూల్ గుర్తించలేదు. వాణిజ్య పన్నుల శాఖ అంతర్గత విచారణలో తీగ లాగితే డొంక కదిలింది.బిగ్‌లీప్ అక్రమాల నేపథ్యంలో వాణిజ్యపన్నుల శాఖ నియమించిన ఓ అధికారి గతేడాది డిసెంబరు 26న ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో విచారణ జరిపారు. అప్పటి రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రెటరీతోపాటు ఎస్.వి.కాశీవిశ్వేశ్వరరావు, శివరామప్రసాద్‌ల మౌఖిక ఆదేశాల మేరకు అక్రమాలను గుర్తించకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసినట్లు ఆయన తన నివేదికలో పేర్కొన్నారు. ఐజీఎస్టీలో అక్రమాలను గుర్తించకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసిన కారణంగా ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లినట్లు వివరించారు. అలాగే ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలోని ప్లియాంటో టెక్నాలజీస్ సంస్థ వాణిజ్య పన్నుల శాఖ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నట్లు నివేదికలో వెల్లడించారు. ఈ నివేదిక ఆధారంగా కాశీవిశ్వేశ్వరరావు, శివరామప్రసాద్, ప్లియాంటో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను వాణిజ్యపన్నుల శాఖ వివరణ కోరింది. సోమేశ్‌కుమార్ ఆదేశాలతోనే తాము సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలని సూచించినట్లు వారిద్దరు వివరణ ఇచ్చారు. వాణిజ్యపన్నుల శాఖకు సంబంధించి తామెలాంటి సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయలేదని ప్లియాంటో టెక్నాలజీస్ సంస్థ వివరణ ఇచ్చింది. ఈనేపథ్యంలో తమ శాఖకు, ఐఐటీ హైదరాబాద్‌కు జరిగిన ఒప్పందం గురించి మరింత లోతుగా వివరాలు రాబట్టేందుకు జనవరి 25న స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్‌కు వాణిజ్యపన్నులశాఖ ఉన్నతాధికారులు లేఖ రాశారు. పలు లోపాలున్నట్లు ఆడిట్ డిపార్ట్‌మెంట్ నివేదిక ఇచ్చింది. డేటా అంతా ఐఐటీ హైదరాబాద్ నియంత్రణలోనే ఉన్నట్లు.. డేటాలో అవసరమైనప్పుడు మార్పులు చేసేందుకు అవకాశముందని వెల్లడించింది. మరోవైపు ఐఐటీ హైదరాబాద్ నిర్వహణలో ఉన్న డేటాబేస్, ఆడిట్ అప్లికేషన్ల గురించి సీడాక్ నుంచి సైతం వాణిజ్యపన్నుల శాఖ నివేదిక తెప్పించింది. ఈనేపథ్యంలో సీడాక్, ఐఐటీ హైదరాబాద్, వాణిజ్యపన్నుల శాఖ ఉన్నతాధికారుల మధ్య జనవరి 30న ఒక సమావేశం జరిగింది. 'స్పెషల్ ఇనిషియేటివ్స్' పేరిట ఏర్పాటైన వాట్సప్ గ్రూప్ నుంచి ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ ప్రొ.శోభన్‌బాబుకు తరచూ ఆదేశాలు వచ్చేవని ఆ సమావేశంలో వెల్లడైంది. ఆ గ్రూప్‌లో సోమేశ్‌కుమార్, కాశీవిశ్వేశ్వరరావు, శివరామప్రసాద్ సభ్యులుగా ఉన్నట్లు తేలింది. వాట్సప్ గ్రూప్ ఏర్పాటు వెనక ఉద్దేశం గురించి వాణిజ్యపన్నుల శాఖ మరోసారి కాశీవిశ్వేశ్వరరావు, శివరామప్రసాద్‌ల నుంచి వివరణ కోరింది. సోమేశ్‌కుమార్ పర్యవేక్షణలోనే ఏర్పాటైన ఆ గ్రూప్‌ను 2022 డిసెంబరులోనే నిలిపివేశామని వారిద్దరు సమాధానమిచ్చారు. అయితే 2024 ఫిబ్రవరి వరకు ఆ వాట్సప్ గ్రూప్‌లో కార్యకలాపాలు నడిచాయని తేలడంతో ఫొటోలు, వీడియోలతో కూడిన చాట్ హిస్టరీని సమర్పించాలని వాణిజ్యపన్నుల శాఖ ఉన్నతాధికారులు వారిద్దరికి అత్యవసర మెమో జారీ చేశారు. ఐజీఎస్టీ నష్టాలకు సంబంధించిన పలు నివేదికలను వాటిలో గుర్తించారు. అలాగే జీఎస్టీ చెల్లింపుల్లో అక్రమాల కేసుల్లోనూ రిజిస్ట్రేషన్లను రద్దు చేయొద్దనే ఆదేశాలున్నట్లు తేలింది. వారిద్దరి సెల్‌ఫోన్లను ఉన్నతాధికారులు జప్తు చేశారు. వారిద్దరు హైకోర్టును ఆశ్రయించగా వారి పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది.

## నేడు రెండో విడత

# రుణమాఫీ!

(మొదటి పేజీ తరువాయి..)

నేషనల్ ఇన్‌ఫర్మాటిక్ సెంటర్‌లో డేటా ప్రాసెసింగ్ సమాచారం ప్రకారం... లక్ష, లక్షన్నర మధ్య అప్పున్న రైతులు సుమారు 7 లక్షల మంది ఉన్నారు. వారికి రూ.6,500 కోట్లు సరిపోతాయని అంచనా వేశారు. రూ.6,500 కోట్లకు సంబంధించిన బిల్లులను సోమవారం సాయంత్రం ట్రెజరీకి సమర్పించారు. వ్యవసాయ శాఖ ప్రొసీడింగ్స్‌ను కూడా జారీ చేసింది. రైతులు, వారి ఖాతాలు, జమచేసే నిధుల వివరాలను ట్రెజరీకి అందజేసింది. మంగళవారం ఉదయానికి సర్వం సిద్ధం చేసి.. 11.45 నుంచి 12 గంటల మధ్య లాంఛనంగా నగదు బదిలీ ప్రారంభిస్తారు. కొంతమంది రైతులను అసెంబ్లీకి పిలిపిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వారికి డమ్మీ చెక్కులు పంపిణీ చేస్తారు. అదే సమయంలో జిల్లా కేంద్రాల్లో ఉన్న కలెక్టర్ కార్యాలయాల్లో జిల్లా కలెక్టర్లు రైతులకు రుణమాఫీ చెక్కులను పంపిణీ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. మరోవైపు కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రుణమాఫీ లబ్ధిదారులు, రైతులు, పార్టీ కార్యకర్తలతో సంబరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండో విడతలో అర్హులైన రైతుల జాబితాను మంగళవారం ఉదయమే వ్యవసాయ శాఖ వెల్లడించనుంది. మొదటి విడతలో రాష్ట్ర ప్రభుత్వం 11.50 లక్షల రైతులకు రూ. 6,099 కోట్లు విడుదల చేయగా... 11.32 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,014 కోట్లు జమ అయ్యాయి. సాంకేతిక కారణాలతో 17,877 ఖాతాలకు చెందిన రూ.84.94 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. ఆర్‌బీఐ సూచించిన వివరాల మేరకు సాంకేతిక సమస్యలు సరిచేసి... ఆర్‌బీఐ నుంచి నిధులు వెనక్కిరాగానే తిరిగి ఆయా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. ఇక వాణిజ్య బ్యాంకులకు అనుసంధానంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(సీడెడ్ సొసైటీలకు) సంబంధించిన రైతుల రుణ ఖాతాలపై తనిఖీలు పూర్తి చేశారు. ఈ నిధులను కూడా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. మంగళవారం తర్వాత రెండు విడతల్లో కలిపి 18.50 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.12,600కోట్లను రుణమాఫీ కింద జమచేసినట్లు అవుతుంది. మూడో విడతలో లక్షన్నర నుంచి రెండు లక్షల మధ్య అప్పున్న రైతులకు ఆగస్టు నెలలో రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి కల్వకుర్తి సభలో తాజాగా ప్రకటించారు. మూడో విడతలో రైతుల సంఖ్య, అవసరమయ్యే నిధులురెండో విడతకు రెట్టింపు ఉండే అవకాశాలున్నాయి.

### రుణమాఫీ కార్యక్రమం.. రైతువేదికల్లో ప్రత్యక్ష ప్రసారం: మంత్రి తుమ్మల

లక్షన్నర రూపాయల వరకు ఉన్న రుణాలను మాఫీచేసే కార్యక్రమాన్ని మంగళవారం శాసనసభ ప్రాంగణంలో సీఎం రేవంత్ చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం ఉన్న అన్ని రైతువేదికల్లో ప్రత్యక్ష ప్రసారం చేయటానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందు నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో రూ. లక్ష వరకు జరిగిన రుణమాఫీలో సందేహాలు ఉన్న రైతులు, అక్కడ ఉన్న అధికారులు, బ్యాంకర్లతో నివృత్తి చేసుకోవాలని, ఆ తర్వాత లక్షన్నర వరకు జరిగే రుణమాఫీ కార్యక్రమాన్ని వీక్షించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో రెండు పర్యాయాలు జరిగింది రుణమాఫీ కాదని, వడ్డీ మాఫీ మాత్రమేనని ఎద్దేవా చేశారు. కానీ తమది చేతల ప్రభుత్వమని, ఇప్పటికే రుణమాఫీలో రెండో విడతకు చేరుకున్నామని, వచ్చే నెలలో 2 లక్షల వరకు కూడా మాఫీ చేస్తామని పేర్కొన్నారు.

# ముగిసిన లాల్‌దర్వాజ బోనాలు

## రెండ్రోజుల పాటు వైభవంగా వేడుకలు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–జూలై 29: రెండ్రోజుల పాటు జరిగిన లాల్‌దర్వాజ బోనాలు ఎంతో వైభవంగా ముగిశాయి. యాపకొమ్మలు చేతిలో పట్టుకొని.. బోనాలను నెత్తిమీద పెట్టుకొని.. ఆడబిడ్డలు ఆలయాలకు పోటెత్తారు. ఇంటిల్లిపాది సల్లంగా చూడు తల్లి.. అంటూ.. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పు దరువులతో సిటీ బస్తీలన్నీ దద్దరిల్లాయి. ప్రతిష్టాత్మక లాల్‌దర్వాజ సింహవాహిని ఆలయానికి భక్తులు పోటెత్తారు. హైదరాబాద్‌లో లాల్ దర్వాజా బోనాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారి కోసం ప్రత్యేక ఘటం ఏర్పాటు చేశారు. భక్తులు అమ్మవారికి మొక్కులను చెలించుకుంటున్నారు. మహంకాళి అమ్మవారికి బోనాలను భక్తులు సమర్పించారు. 23 ప్రధాన ఆలయాలో బోనాల జాతర ఘనంగా కొనసాగింది. బోనాల సందర్భంగా పలు ఆలయాల్లో భక్తుల కోసం అన్నదానాలకు ఏర్పాట్లు చేసారు. ఆలయాలన్నింటిని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి.. మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం, హరిబౌలి అక్కన్న మాదన్న దేవాలయం, గౌలిపుర భారతమాత అమ్మవారి ఆలయం, మీరాలం మండిలోని శ్రీ మహంకాళేశ్వర దేవాలయంతోపాటు ఉప్పుగూడ మహంకాళి ఆలయాల్లోనూ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం సింహవాహిని అమ్మవారికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పట్టువస్త్రాలు సమర్పించారు. హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారికి మంత్రి శ్రీధర్‌బాబు, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్‌లతో కలిసి పట్టు వస్త్రాలు అందించారు. మీరాలం మండి మహంకాళేశ్వర అమ్మవారికి మంత్రి జూపల్లి కృష్ణారావు, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించారు. సింహవాహిని అమ్మవారికి మంత్రులు శ్రీధర్‌బాబుతోపాటు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, లాల్‌దర్వాజా, మేకలబండ ప్రాంతంలో కొలువుదీరిన నల్లపోచమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తదితరులు అక్కన్న మాదన్న, సింహవాహిని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

## ఢిల్లీ కోచింగ్ సెటంర్ ఘటన

# రాజ్యసభలో ఛైర్మన్ ధన్‌కడ్ ఆవేదన

### – అన్నిపక్షాలతో చర్చిస్తామని వెల్లడి

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఓ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో శనివారం జరిగిన దుర్ఘటనపై రాజ్యసభలో స్వల్ప సమయం చర్చకు వచ్చింది. సభ ఛైర్మన్, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ కోచింగ్ సెంటర్లు పూర్తిగా వ్యాపారమయంగా మారిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఎప్పుడు న్యూస్ పేపర్ చదువుదామని తెరిచినా రెండు పేజీలు ఈ సంస్థల ప్రకటనలే ఉంటాయి' అని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై సభలో స్వల్పకాలిక చర్చ సముచితమని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై అన్ని పక్షాలతో కలిపి ఇన్–ఛాంబర్ మీటింగ్ ఏర్పాటుచేయాలని ఆయన నిర్ణయించినట్లు వెల్లడించారు. శనివారం సాయంత్రం రావూస్ స్టడీ సర్కిల్‌లోని బేస్‌మెంట్‌లోకి అకస్మాత్తుగా వరద నీరు ప్రవహించడంతో ముగ్గురు విద్యార్థులు తానియా సోని, శ్రేయా యాదవ్, నవిన్ డెల్విన్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టడంతో కోచింగ్ సెంటర్ యజమాని అభిషేక్ గుప్తా, కోఆర్డినేటర్ దేశ్‌పాల్ సింగ్ సహా ఏడుగురిని అరెస్టు చేశారు. ప్రమాదం జరిగిన మూడంతస్తుల భవనం సెల్లార్‌ను స్టోర్ రూమ్, పార్కింగుకు కేటాయిస్తామని ప్రణాళికలో చూపించి గ్రంథాలయంగా ఉపయోగిస్తున్నట్లు తేలిందని పోలీసులు పేర్కొన్నారు.





# ఘనంగా అంతర్జాతీయ పులుల దినోత్సవం

- పలువురు దాతలకు సన్మాన కార్యక్రమం

ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)-వెంకటేష్ జూలై 29:

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో సోమవారం ఘనంగా అంతర్జాతీయ పులుల దినోత్సవం అటవీశాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది సమక్షంలో నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మన్ననూరు గ్రామంలోని ఈఈసీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద దాతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అటవీ శాఖ అధికారులు మన్ననూరు గ్రామంలోని బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. పుల్లల దినోత్సవం సందర్భంగా పలువురు ఈవెంట్‌కు హాజరైన సంస్థలు హైటికోస్, ఐసిఐసిఐ ఫౌండేషన్, అపోలో టోటల్ హెల్త్, నిర్మాణ్ ఆర్గనైజేషన్, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, ది ప్రోస్పెరిటీ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ది స్విచెకో సస్టైనబిలిటీ, ఎలిమా, యునైటెడ్ వే, భూమిక ఉమెన్స్ కలెక్టివ్. ఐఎఫ్ఎస్, డి ఎఫ్ ఓ రోహిత్ గోపిడి నాగర్ కర్నూల్ సి ఎస్ ఆర్ దాతల ప్రయత్నాలను ఈ సందర్భంగా కొనియాడారు. కెమెరా ట్రంపులు, ఫ్రంట్ లైన్



సిబ్బందికి ప్రాథమిక సౌకర్యాలు ఏర్పాటు, గ్రామాల తరలింపు మరియు అనేక ఇతర ముఖ్యమైన అంశాలతో పాటు పులుల సంరక్షణ, సంరక్షణతో పాటు భాగస్వామ్యం కోసం మరింత అవకాశలపై ప్రదర్శించారు. అదేవిధంగా మనందరిలోని బాలురు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఫ్రంట్ లైన్ సిబ్బంది, టైగర్ ర్యాలీని చేపట్టినంతరం విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పాఠశాల విద్యార్థులకు ట్రెక్కింగ్ కార్యక్రమం నిర్వహించారు. పులుల ప్రాముఖ్యతను, పులులకు రాయబారులుగా ఎలా ఉండవచ్చో వారికి వివరించారు. ఇందులో భాగంగా ప్రతాప్ రుద్ర కోట వద్దకు తీసుకెళ్లి అక్కడ వృక్ష, జంతుజాలం గురించి వివరించారు. స్థానిక చెంచులు అయిన నేచర్ గైడ్స్ వారికి పక్షుల వీక్షణ సెషన్ నిర్వహించారు. హైదరాబాద్‌లోని నసీర్ బాయ్స్‌కు చెందిన పాఠశాల విద్యార్థులు ఈఈసీ మన్ననూర్‌ను సందర్శించి అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోని జంగిల్స్‌పై



వీడియోలను ప్రదర్శించారు. అనంతరం పులుల ప్రాముఖ్యత మరియు ప్రకృతి పరిరక్షణలో వాటి పాత్ర గురించి పాఠశాల విద్యార్థులతో %×ఖీా ణఖీా% నాగర్‌కర్నూల్ రోహిత్ గోపిడి ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుశాంత్ బోబడే, %×ఖీా% ట్రైనీ, అమ్రాబాద్ డివిజన్ అటవీ సిబ్బంది, పాల్గొన్నారు.





# ప్రమాదకరంగా డ్రైనేజీ మెయిన్ వాల్

- పట్టించుకోని అధికారులు ప్రజాప్రతినిధులు
- చిన్న పార్టీ వర్షం వస్తే రోడ్లన్నీ జలమయమవుతాయి
- వాహనదారులకు ఎలాంటి ప్రమాదం జరగకముందుకే ప్రధాన మెయిన్ రోడ్లపై డ్రైనేజీ మరమ్మతులు చేయండి
- టిడిపి పార్టీ ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ అధ్యక్షుడు మహేందర్ యాదవ్

ఫోకస్ న్యూస్, ఓల్డ్ బోయిన్ పల్లి కంటోన్మెంట్ జూలై 29:

ఓల్డ్ బోయిన్ పల్లి ప్రధాన రహదారులపైన డ్రైనేజీ మెయిన్ వాల్స్ బిల్లాలు పగిలిపోయిన కూడా, అధికారులకు ప్రజాప్రతిలకు చీమకుట్టినట్లు కూడా లేదని, టిడిపి పార్టీ ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ అధ్యక్షుడు మహేందర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ... ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్, కంటోన్మెంట్ నియోజకవర్గం ఆరో వార్డుకు మధ్యన శ్రీ చైతన్య స్కూల్ ప్రధాన రహదారిలో ఉన్న ప్రధాన డ్రైనేజ్ మెయిన్ వాల్ సుమారుగా 12 సీట్ల లోతున ఉండే ఈ మెయిన్ వాల్ 20 రోజుల నుంచి ఎంతో ప్రమాదకరంగా ఉంది. చిన్నపాటి వర్షం వస్తే ఓల్డ్ బోయిన్ పల్లి ప్రాంతంలోని ఓల్డ్ కళ్యాణి మూవీ మ్యాక్స్, శ్రీ చైతన్య స్కూల్, సీతారామపురం ప్రధాన రహదారులన్నీ జలమాయమై, ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక వాహనదారులు సతమతమవుతున్నారు. ఓల్డ్ బోయిన్ పల్లి చౌరస్తా నుండి సీతారామపురం వెళ్లే దారిలో దాదాపుగా 5. 6 మెయిన్ వాల్స్ బిల్లలు, బేస్ పగిలిపోవడం జరిగింది. ఈ రోడ్డుపై ఇంత భయంకరమైన మెన్ వాల్స్ పగిలిపోయిన కూడా ఎవరు పట్టించుకోవడంలేదని వాహనదారులు తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. ఇప్పటికైనా ఏలాంటి ప్రమాదం జరగక ముందే జిహెచ్ఎంసి అధికారులు, కంటోన్మెంట్ బోర్డు అధికారులు, స్థానిక రాజకీయ నాయకులు చొరవ తీసుకొని మెయిన్ వాల్స్ లను కొత్తవి అమర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

# పొలాలలకు మీటర్లు పెట్టాలని చెప్పలేదు

- ఇందుకోసం 30వేల కోట్లు వదులుకున్నాం
- విద్యుత్ స్థాపక శక్తిని పెంచిన ఘనత మాదే
- నింజగానే కెసిఆర్ సత్యహరిశ్చంద్రుడే
- అసెంబ్లీలో మాజీ మమంత్ర సమర్థన
- విద్యుత్ రంగాన్ని అప్పుల్లోకి నెట్టారన్న రాజగోపాల్ రెడ్డి

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 29:

రైతుల పొలాల్లో మీటర్లు పెట్టడానికి కేసీఆర్ ఒప్పుకోలేదని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రం ఇచ్చే రూ.30 వేల కోట్లను కూడా వదులుకున్నట్లు తెలిపారు. విద్యుత్ మీటర్లపై సీఎం ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. మోదీ, కేసీఆర్, ఉదయ్ స్కీమ్ గురించే మాట్లాడుకున్నారని చెప్పారు. 2014కి ముందు మాత్రమే కరెంటు లైన్ల కింద ఇళ్ల నిర్మాణం జరిగింది. భారాస ప్రభుత్వంలో కరెంటు లైన్ల కింద ఇళ్ల నిర్మాణం జరగలేదు. పదేళ్ల భారాస పాలనలో స్థాపిత విద్యుత్ సామర్థ్యం పెరిగింది. 2014లో రాష్ట్రంలో వ్యక్తిగత విద్యుత్ వినియోగం 1,196 కిలో వాట్లు. 2024లోఇది 2,349 కిలో వాట్లకు చేరింది. మా ప్రభుత్వంలోనే విద్యుత్ వినియోగం పెరిగింది. రూ.90 వేల కోట్లు పెట్టి విద్యుత్ సరఫరాను బలోపేతం చేశాం. వినియోగం ఆధారంగానే విభజన సమయంలో రాష్ట్రానికి విద్యుత్‌ను కేటాయించారు. రూ.24 వేల కోట్ల అప్పుతో విద్యుత్ రంగం మా చేతికి వచ్చింది. అప్పులు చేయకుండా అభివృద్ధి ఎలా చేయాలి? అప్పులు చేయకుండా నోట్లు ముద్రించాలా? అప్పులు చేస్తున్నామని అసెంబ్లీలో కేసీఆర్ ఆనాడే చెప్పారు. ఏదో కొత్త విషయం చెప్పినట్లు ఇప్పుడు పదేపదే అప్పులు చేశారు అంటున్నారు' అని జగదీశ్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముమ్మాటికీ సత్యహరిశ్చంద్రుడే అని మాజీ విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తేల్చిచెప్పారు. రేవంత్‌లా సంచులు మోసే చంద్రుడు కాదు అని ఆయన పేర్కొన్నారు. శాసనసభలో విద్యుత్ పద్దులపై చర్చ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. సత్యహరిశ్చంద్రులు అయితే ఎందుకు విద్యుత్ జ్యుడిషియల్ కమిషన్‌కు అడ్డు వస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై జగదీశ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. విద్యుత్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దొంగతనం దొరికిపోయింది కాబట్టే రేవంత్ రెడ్డి ఎందుకు భుజాలు తడుముకుంటున్నారని జగదీశ్ రెడ్డి నిలదీశారు. మా అధినేత కేసీఆర్ హరిశ్చంద్రుడే. రేవంత్ రెడ్డిలా సంచులు మోసే చంద్రుడు కాదు.. చంద్రుడికి సంచులు మోసి జైలుకు పోయింది రేవంత్ రెడ్డినే అని జగదీశ్ రెడ్డి గుర్తు చేశారు. నేను విద్యుత్ విషయంలో నిజనిజాలు మాట్లాడుతుంటే.. రేవంత్ రెడ్డినే వడివడిగా సభలోకి వచ్చి నాకు అడ్డు తగిలారు. సీఎం సభలో అడుగు పెట్టగానే తప్పుదోవ పట్టింది. కేసీఆర్ కాలు గోటికి మీరు సరిపోతారా..? కేసీఆర్ గురించి మాట్లాడింది రికార్డుల నుంచి తొలగించండి.. సభను హుందాగా నడిపించాలి. సభలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల మీరు ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నట్లు అని జగదీశ్ రెడ్డి అధికారపక్షాన్ని నిలదీశారు. గత ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని అప్పుల్లోకి నెట్టేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. అప్పుల నుంచి విద్యుత్ రంగాన్ని బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. సీఎంపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శలు సరికాదన్నారు. గత ప్రభుత్వ తప్పులు ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత మాపై ఉంది. భారాస ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసింది. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు అదనపు విద్యుత్‌ను యూపీఏ ప్రభుత్వం కేటాయించింది. జనాభా ప్రాతిపదికన కాకుండా రాష్ట్ర అవసరాల మేరకు విద్యుత్ కేటాయించారు. కేసీఆర్ సభకు వచ్చి మాట్లాడాలని కోరుతున్నాం. కేసీఆర్ సభకు ఎందుకు రావట్లేదని అడిగితే.. కేసీఆర్‌తో మాట్లాడే స్థాయి మాది కాదన్నారు. సభకు రానప్పుడు ఆయనకు ప్రతిపక్ష హోదా ఎందుకు? ప్రతిపక్ష నేత హోదా కేసీఆర్ కాకుండా వేరేవారు తీసుకోవచ్చు కదా? విద్యుత్ అవకతవకలపై కమిషన్ వేసి దర్యాప్తు చేస్తున్నాం. యాదాద్రి పవర్ ప్లాంట్ లాభదాయకం కాదని 2018లోనే చెప్పాను. ఈ ప్లాంట్ పూర్తయ్యేందుకు అదనంగా రూ.11 వేల కోట్లు ఖర్చు పెట్టాలి. డబ్బులు పోయినా యాదాద్రి పవర్ ఎ÷-లాంట్ పూర్తికాలేదు. రామగుండంలో పవర్ ఎ÷-లాంట్ ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో ఉంది. అక్కడ కాకుండా యాదాద్రిలో ఎందుకు నిర్మించారు?' అని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు.

# హైదరాబాద్‌లో శాంతిభద్రతలు దారుణం

- పట్టపగలే హత్యలు జరుగుతున్నా పట్టింపేది
- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే అక్బరుద్దీన్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 29:

తెలంగాణ అసెంబ్లీలో ఏఐఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాదులో అన్ని పోలీస్ స్టేషనులకు లంచాలు, మామూళ్లు వెళ్తున్నాయని అక్బరుద్దీన్ ఆరోపించారు. ఈ విషయం చెప్పడానికి తాను ఎవరికీ భయపడనని, నిజాలు నిర్భయంగా మాట్లాడుతానంటూ అసెంబ్లీలో చర్చలో భాగంగా ఇలా వ్యాఖ్యానించారు. తెలంగాణ అసెంబ్లీలో బడ్జెట్ చర్చలో భాగంగా సోమవారం అక్బరుద్దీన్ మాట్లాడుతూ.. 'ఏసీపీ ర్యాంక్ అధికారి నాకు ఫోన్ చేసి పోలీస్ స్టేషన్ కోసం డబ్బులు అడిగారు. పీఎస్ కోసం మమ్మల్ని డబ్బులు అడగటం ఏంటి. మీకు వచ్చే మామూళ్లు, లంచాలు ఏమయ్యాయి. ఆ డబ్బులు అయిపోయాయా? వాటితో మీరు పోలీస్ స్టేషన్ కట్టుకోలేరా? ఇదేంటో స్పీకర్ గారు మీరే చెప్పండి. ప్రభుత్వం ఇలాంటి పనులపై ఫోకస్ చేయాలని అన్నారు. హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్ సమస్య ఉంది. ఇదే విషయంపై అసెంబ్లీలో హరీష్ రావు, నేను మాట్లాడితే లా అండ్ ఆర్డర్ బాగుంది అని మంత్రులు చెబుతున్నారు. మళ్లీ నిన్న నగరంలో 3 హత్యలు అయ్యాయి. ఇంటి ముందు నిల్చున్న వారిని కొట్టడం కాదు. నేరస్తులను, దొంగలపై ప్రతాపం చూపించండి. నేరస్థులను పట్టుకోవడం టాస్క్ ఫోర్స్ పోలీసుల పని కానీ, వాళ్లు రాత్రి పూట సామాన్యుల మీద, అది కూడా ఇంటి ముందు నిల్చున్న వారిపై లాఠీఛార్జ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో పోలీసులు రాత్రిపూట డ్యూటీలు చేస్తూ, పగటి పూట పడుకుంటున్నారా. అందుకే నగరంలో పగటిపూట హత్యలు జరుగుతున్నాయని' అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ లో లా అండ్ ఆర్డర్ ఎక్కడుంది. నగరంలో ఎటు చూసినా నేరాలు ఘోరాలు జరుగుతున్నాయి. నగరంలో లా అండ్ ఆర్డర్ పై ఆరోపణలు చేయగా, అంతా ఓకే అని చెబుతున్నారు. మంత్రి అలాంటిదేమీ లేదని చెప్పిన మరుసటి రోజే నగరంలో మూడు హత్యలు జరిగాయంటే ఏమని అర్థం చేసుకోవాలి. ఇంట్లో ఎవరికైనా అనారోగ్యం సమస్య వస్తే, బయటకు వస్తే పోలీసులు కొడుతున్నారు. కొట్టారని బయటకు రాకుండా ఇంట్లోనే కూర్చోవాలా అని ప్రశ్నించారు. ఐటీ ఉద్యోగులు అయితే అర్ధరాత్రి వేళ ఇంటికి వెళ్తారు, వారిపై సైతం వివరాలు కనుక్కోకుండా లాఠీ ఛార్జ్ చేస్తున్నారని పోలీసులపై ఆరోపణలు చేశారు.

# రైతుల సమస్యలను మీ రాష్ట్రాల్లో తీర్చండి

- పార్లమెంటులో మాట్లాడడం కాదు..ఆచరించండి
- రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డ కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 29:

ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సోమవారం పార్లమెంట్‌లో రైతు సంక్షేమంపై చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రైతు సంక్షేమంపై రాహుల్ గాంధీ మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందంటూ ఎద్దేవా చేశారు. పార్లమెంటులో రాహుల్ గాంధీ చెప్పిన మాటలు తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ వంటి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో రైతులకు ఇచ్చిన హామీలపై రాహుల్ ఎందుకు మాట్లాడట్లేదని ధ్వజమెత్తారు. తెలంగాణ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు, వారి సంక్షేమానికి అనేక హామీలు ఇచ్చింది. వీటిల్లో రైతులు, కౌలు రైతులకు రూ.15,000 , వ్యవసాయ కూలీలకు రూ. 12,000 , మద్దతు ధరపై బోనస్‌గా రూ.500 ఇస్తామని ప్రగల్భాలు పలికారు. వీటిలో ఏ ఒక్క హామీని తెలంగాణ ప్రభుత్వం అమలు చేయట్లేదని, వీటిని అమలు చేసే దిశగా ముందు రాహుల్ దృష్టి సారించాలని కిషన్ రెడ్డి చురకలంటించారు. 2004 నుంచి 2014 మధ్య కాలంలో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు రైతులను నిర్లక్ష్యం చేసిన సంగతి గుర్తుచేశారు. 2013లో పార్లమెంట్ సాక్షిగా యూపీఏ ప్రభుత్వ హయాంలో చెప్పిన మాటలు మర్చిపోయారా? స్వామినాథన్ కమిటీ సిఫార్సులను ఆమోదించలేమని అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి శరద్ పవార్ సభా వేదికపై చెప్పిన సంగతి గుర్తులేదా? అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఉత్పత్తి వ్యయంపై 50 శాతం కనీస మద్దతు ధరను అందించడం మార్కెట్ అవకతవకలకు దారితీస్తుందని, ఉత్పత్తి వ్యయానికి మధ్య యాంత్రిక అనుసంధానం కొన్ని సందర్భాల్లో ప్రతికూల ఉత్పాదకతను కలిగిస్తుందని అప్పటి యూపీఏ ప్రభుత్వం పేర్కొనలేదా? అని ఆయన ప్రశ్నించారు. ఇకపై కాంగ్రెస్ పార్టీ మొసలి కన్నీరును ప్రజలు, రైతులు నమ్మే స్థితిలో లేరని ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోమవారం లోక్‌సభలో చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ రైతులకు చట్టబద్ధంగా ఎంఎస్‌పి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందిస్తూ కిషన్ రెడ్డి యూపీఏ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. 2004 నవంబర్ 18న ప్రొఫెసర్ ఎం.ఎస్ స్వామినాథన్ నేతృత్వంలో 'నేషనల్ కమిషన్ ఆన్ ఫార్మర్స్ (ఎన్‌సిఎఫ్)' ఏర్పడిందని కిషన్ రెడ్డి కాంగ్రెస్‌కు గుర్తు చేశారు. సగటు ఉత్పత్తి వ్యయం కంటే కనీస మద్దతు ధర 50 శాతం అధికంగా ఉండాలని స్వామినాథన్ కమిటీ అప్పట్లో సిఫార్సు చేసింది. ఇది సగటు ఉత్పత్తి వ్యయం కంటే ఎక్కువ. అయితే నాడు అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా దీనిని పక్కన పెట్టిందనేది నిజం కాదా అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. 2013లో డిసెంబర్ 10న జరిగిన పార్లమెంటు శీతాకాల సమావేశాలలో అప్పటి కేంద్ర వ్యవసాయ మంత్రి శరద్ పవార్ నేతృత్వంలోని యూపీఏ సర్కార్ ఇదే పార్లమెంటులో ప్రభుత్వం ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అడిగిన ప్రశ్నలకు లిఖితపూర్వక సమాధానం ఇస్తూ.. యూపీఏ నేతృత్వం లోని ప్రభుత్వం రైతులపై జాతీయ కమిషన్ సిఫారసులను ఆమోదించేది లేదని స్పష్టం చేసింది. స్వామినాథన్ కమిషన్ నివేదికలో ఇచ్చిన సిఫార్సును నాటి ప్రభుత్వం ఆమోదించలేదు. అయితే ప్రధాని మోదీ అధికారంలోకి రాగానే ఎంఎస్ స్వామినాథన్ నేతృత్వంలోని కమిటీ సిఫార్సులను అమలు చేశారు. ఉత్పత్తి వ్యయంపై 50 శాతం కనీస మద్దతు ధర అమలు చేస్తున్నారు. దీంతో పాటు ఆయా పంటల ఎంఎస్పీని ఎప్పటికప్పుడు పెంచుతున్నట్లు కిషన్‌రెడ్డి వివరించారు. యావత్ ప్రపంచానికి గర్వకారణమైన వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్, ఆయన సిఫార్సులను కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అగౌరవపరిచిందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కానీ ప్రధాన మోదీ అలా చేయలేదన్నారు. స్వామినాథన్ సిఫార్సులను స్వీకరించి, ఆయనకు తగిన గౌరవాన్ని అందించినట్లు తెలిపారు. ఇటీవలే స్వామినాథన్‌ను భారతరత్న పురస్కారం అందించి వ్యవసాయ రంగాన్ని సత్కరించినట్లు తెలిపారు.

# మిస్టర్ బచ్చన్ టీజర్‌పై పెదవి విరుపులు..

దర్శకుడు హరీష్ శంకర్, రవితేజ కాంబినేషన్‌లో వస్తున్న 'మిస్టర్ బచ్చన్' టీజర్ విడుదలైంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ఈ సినిమాని నిర్మిస్తోంది. టీజర్ ఫంక్షన్ కి రవితేజ వస్తాడు అనుకున్నారు, కానీ అతను రాలేదు. మామూలుగానే దర్శకుడు హరీష్ శంకర్ తన మాటలతో, సామాజిక మాధ్యమాల్లో వివాదాలతో ఉంటూ వస్తూ ఉంటాడు. అందుకే నేమో టీజర్ కన్నా, అతను మీడియా వాళ్ళతో మాట్లాడిన మాటలే ఎక్కువ వైరల్ అయినట్టుగా కనపడుతోంది.అందుకే 'మిస్టర్ బచ్చన్' టీజర్ కూడా అంత గొప్పగా లేకపోవటంతో, టీజర్ ని ఎవరూ పట్టించుకోలేదు. హరీష్ శంకర్ వ్యాఖ్యలు, వివాదాల మాటలే ఎక్కువగా అందరినీ ఆకర్షించాయని అనుకుంటున్నారు. ఈ 'మిస్టర్ బచ్చన్' సినిమా ఇంతకు ముందు అజయ్ దేవగన్ నటించిన 'ది రైడ్' సినిమాకి అనువాదంగా చేస్తున్నారు. అయితే ఈ సినిమా ఎక్కువగా ప్యాకేజీలో హరీష్ శంకర్ తీశాడని పరిశ్రమలో వినిపిస్తున్న మాట. అందుకనే ఈ సినిమా పై అంతగా ఆశలు పెట్టుకొనవసరం లేదు అని కూడా అంటున్నారు. టీజర్ ఫంక్షన్ కి రవితేజ రాకపోవటంతో రకరకాలుగా మాట్లాడు కుంటున్నారు. రవి తేజకి ఈ సినిమా ఫలితం ముందే తెలుసు, అందుకే రాలేదు అని, లేదు అతనికి ప్రొడక్షన్ హౌస్ కి మధ్య ఇంకా కొన్ని విషయాలు తేలలేదు అందుకని రాలేదు, అని అక్కడికి వచ్చిన వాళ్ళు మాట్లాడుకోవటం కనిపించింది. రవితేజ రాకపోవటంతో వచ్చిన అభిమానులు చాలా నిరాశ పడ్డారు. టీజర్ లో సినిమా గురించి ఇంకా కొంచెం రివీల్ చేస్తే బాగుండేది, హరీష్ శంకర్ టీజర్ లో విషయం చూపించలేకపోయారు అని కూడా అంటున్నారు.



## నిర్మాత ఉప్పలపాటి సూర్యనారాయణ

# కన్నుమూత..

తెలుగు సినీ ఇండస్ట్రీలో మరో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ నిర్మాత, సూపర్‌స్టార్ కృష్ణ బావ, మహేష్ బాబు మామ ఉప్పలపాటి సూర్య నారాయణ కన్నుమశాడు. గుండెపోటుతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. ఆయన మరణంతో టాలీవుడ్ ఇండస్ట్రీ శోక సంద్రంలో మునిగిపోయింది. సూర్యనారాయణ బాబు కృష్ణా జిల్లాలోని రిమ్మనపూడి అనే గ్రామంలో జన్మించారు. కృష్ణ రెండవ చెల్లి లక్ష్మీ తులసిని పెళ్లి చేసుకున్న అతడు పద్మావతి ఫిలిమ్స్ బ్యానర్ స్థాపించి సినీ రంగంలోకి అడుగుపెట్టాడు. నిర్మాతగా ఆయన తెలుగుతో పాటు కన్నడ, హిందీలో భాషల్లో 24 సినిమాలను నిర్మించాడు. సూపర్ స్టార్ కృష్ణతో కలిసి కురుక్షేత్రం, మనుషులు చేసిన దొంగలు, దొంగల దోపిడి సినిమాలు చేసిన సూర్యనారాయణ మహేష్ బాబు, రమేశ్ బాబులతో 'బజారు రౌడీ' సినిమాను నిర్మించారు. ఇంకా ఇవే కాకుండా అల్లుడు దిద్దిన కాపురం, శంఖారావం, అన్నదమ్ముల సవాల్ వంటి సూపర్ హిట్ చిత్రాలను తెలుగు ఇండస్ట్రీకి అందించాడు.ఇక సినిమాతో పాటు రాజకీయాల్లో కూడా తన లక్ ను పరీక్షించుకున్నారు. అప్పట్లో గుడివాడ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్టీఆర్ పై పోటీ చేసి వార్తల్లో నిలిచారు. ఆ ఎన్నికలలో ఎన్టీఆర్ పై చిత్తుచిత్తుగా ఓడిపోయారు. అనంతరం చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు.






# డబుల్ ఇస్మార్ట్ నుంచి మరో సాంగ్ రిలీజ్..

ఉస్తాద్ రామ్ పోతినేని, డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్‌ల డెడ్లీ కాంబినేషన్‌లో సంజయ్ దత్ పవర్ ఫుల్ పాత్రలో ,కావ్య థాపర్ కథానాయికగా తెరకెక్కిన మోస్ట్-వెయిటెడ్ పాన్ ఇండియా మూవీ 'డబుల్ ఇస్మార్ట్' ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సినిమా యూనిట్ ప్రమోషన్స్ కార్యక్రమాల్లో వేగం పెంచుతూ రెండు పాటలను విడుదల చేసి సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నాలు చేసింది. తాజాగా ఇప్పుడు ఈ చిత్రం మూడో సింగిల్ 'క్యా లఫ్డా' అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఇప్పటివరకు వచ్చిన ఫస్ట్ సింగిల్ 'స్టెప్పా మార్', సెకెండ్ సింగిల్ 'మార్ ముంత చోడ్ చింత' అదిరిపోయే స్పందనను రాబట్టుకోగా ఇప్పుడు మేకర్స్ థర్డ్ సింగిల్ 'క్యా లఫ్డా' ప్రోమోతోనే మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. తాజాగా విడుదలైన పాట కూడా వాటిని మించేలా మంచి మెలోడియస్‌గా ఉంది. మణిశర్మ మార్క్ వినిపించింది. అంతేకాదు విజువల్స్ పరంగా పరి తన గురువు ఆర్జీవీని అట్టే దించేసినట్లు ఆ క్లోజప్ షాట్లు చూస్తే ఇట్టే తెలిసి పోతుంది. పాటలో రామ్, కావ్యా థాపర్ రొమాంటిక్ కెమిస్ట్రీ వండర్ ఫుల్‌గా కుదిరింది. ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఈ సినిమా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్ మెంట్ నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని ఐదు భాషల్లో విడుదల చేయనున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతం అందించిన ఈ చిత్రానికి సామ్ కె నాయుడు, జియాని గియానెలీ సినిమాటోగ్రఫీ బాధ్యతను నిర్వర్తించారు.







## విజయభాస్కర్ దర్శకత్వంలో

# ఉషాపరిణయం

నువ్వేకావాలి, మన్మథుడు, మల్లీశ్వరి వంటి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాలను తెరకెక్కించిన ప్రముఖ దర్శకుడు కె.విజయ్ భాస్కర్ దర్శకత్వంలో తాజాగా మరో లవ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రాబోతుంది. ఉషా పరిణయం అనే బ్యూటిఫుల్ టైటిల్‌తో రూపొందిన ఈ చిత్రానికి లవ్ ఈజ్ బ్యూటిఫుల్ అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో శ్రీకమల్, తన్వీ ఆకాంక్ష, సూర్య ముఖ్య తారలు. ఆగస్టు 2న చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ ముఖ్య అతిథిగా హాజర య్యారు.దర్శకుడు విజయ్ భాస్కర్ మాట్లాడుతూ 'సాయి ద రియల్‌హీరో.. సాయి దుర్గ తేజ్ హీరోగానే కాకుండా సమాజం గురించి కూడా ఆలోచిస్తాడు. పద్నాలుగేళ్ల తరువాత సాయిను చూస్తున్నాను. సాయిని 14 ఏళ్ల క్రితం పవన్‌కల్యాణ్ గారి నిర్మాణ సారథ్యంలో నేనే హీరోగా ఇంట్రడ్యూస్ చేయాలి కానీ కుదర లేదు. ఆ రోజు ఎంత వినయంగా, సంస్కారంతో ఉన్నాడో.. ఈ రోజు అలాగే ఉన్నాడు, చిరంజీవి గారి దగ్గర ఉన్న ప్రేమ సాయిలో కనిపించింది. మా టీమ్‌ను ఎంకరైజ్ చేయడానికి వచ్చినందుకు ఆనందంగా ఉంది. నాకు ఎటు వంటి ఇబ్బంది లేకుండా మా ఫ్యామిలీ సపోర్ట్‌తో ఈ సినిమా నిర్మించాను. ఈ చిత్రానికి ధ్రువన్ చాలా మంచి సంగీతం ఇచ్చాడు. సతీష్ ఫోటోగ్రఫీ ఈసినిమాకు ఎంతో ప్లస్ అయ్యింది. తన్వీ చాలా కంఫర్టబుల్ హీరోయిన్. కాశ్మీర్‌లో ఎంత ఇబ్బందైనా అంత చలిలో కూడా ఎంతో సహకరించింది. సినిమాలో టెక్నిషియన్స్, ఆర్టిస్ట్ కూడా ఎంతో ఓన్ చేసుకుని ఈ సినిమా చేశారు' అన్నారు. హీరో శ్రీకమల్ మాట్లాడుతూ 'అందరి పూర్తి సహకారంతో ఓ మంచి సినిమాను అందిస్తున్నాం. అనుకున్న టైమ్ కంటే ముందే షూటింగ్‌ను పూర్తిచేశాం. సాయి దుర్గ తేజ్‌కు నేను అభిమానిని. ఆయన రావడం ఎంతో మధురానుభూతి. ఈ సినిమాను అందరూ థియేటర్‌లో చూసి మమ్ములను ఎంకరైజ్ చేయాలని కోరుకుంటున్నాను. నాన్న గారి పేరు నిలబెట్టడానికి ప్రయత్నిస్తాను. తాన్వీ ఆకాంక్ష.. చాలా మంచిగా పెంచారు.